5



# డామిట్ కథ అడ్డం తిరిగింది

డామిట్! కథ అడ్డం తిరిగింది. ఇక్కడ ఇంటర్వెల్ పెట్టి తరవాత అడ్డంతిప్పి టెంపో మౌంట్ చేసి క్లయిమాక్స్‌కి తోలీదామనుకుంటే — దీందుంప తెగ — ఇక్కడే కాళ్ళు బారజాపేసింది. షేక్స్పియరన్నట్టు — వాట్ టుడూ - దట్, మైడియర్ వెంకటేశం, ఈజ్ ది క్వెశ్చన్!

ఏంవాయ్ క్వెశ్చన్‌మార్కు వాలకం పడింది ?... అదంతేలే. షేక్స్పియర్ అన్నవన్నీ బైహార్టు చెయ్యడం కన్న అనని నాలుగుముక్కలూ ముక్కున తగిలించేసుకోడం

ఈజీగా ఉంది. శా్రిటజీ మార్చమని మేకియవిల్లీ ఊరికే అన్నాడుటోయ్ ! ఛస్తే అనడు. ఏదో లిటిగేషనుండబట్టే అన్నాడు.

గిరీశంగాడు కథ రాస్తున్నాడో లేదో చూస్రకా-రమ్మని మీ మావఁ పంపాడన్నాను తెలుసుగాని.... చెప్పేది విను. అసలు ఫిలింస్టోరీ రాయడం మజాకా కాదు. మీనాన్న రొండిలోంచి రూపాయలేనా సులువుగా ఒలి పొస్తాయి గాని అయిడియాలలా కా్కదు. కథలా ఒదిలీసి జీవితంలో ఆరితేరినవాడి అనుభవసారం విను. బాగుపడు... ఆలోపల ఒక సిగారందుకో చెబుతా—

ఈమధ్య యూరప్‌నించి రూరిటేనియా రాజా వారొచ్చారుగదూ. ఒక్కగంట మాట్లాడాడో లేదో పొలి టీషియన్‌ల ముతాని వెళ్ళగొట్టేసి, మిస్టర్ గిరీశం ! సేవ్ మీ ... ఓ! సేవ్ మీ ఫ్రమ్ పొలిటీషియన్స్. నువ్వే నికార్సైన పొలిటీషియన్‌వి. నిన్ను విడిచి ఒక్కఘడియకూడా వుండలేను అన్నాడు-వాట్‌టుడూ-సరే శ్రీవారితో రూరిటేనియా వెళ్ళి రెస్టు తీసుకొన్నాం. ఏవిఁగార్డెన్సు, ఏవిఁ పాలెస్‌లూ - అంతా మన నెక్స్‌ట్ పిక్చర్‌లో డ్రీం సీక్వెన్సులా వుందంటే నమ్ము. అక్కడే ఇందాకటి డిస్కవరీ చేసింది ... న్యూస్ పేపరు వాళ్ళన్నట్టు అందులో 'ఇన్ సైడ్ డోప్' ఇస్తున్నా విను. మార్నింగ్ గార్డెన్‌లో ఆ పూట బ్రేక్‌ఫాస్ట్ చేస్తున్నాను - నిన్నూ, బుచ్చమ్మనీ తల్చుకుంటూ-నువ్వుంటే ఎంత ఎంజాయ్ చేసేవాడవనీ-

చద్దివణ్ణం అనేది కొన్నాళ్లైనా తిన్నందుకు షేమ్‌షేమ్ అనుకునేవాడివి.

అంతలో వార్నింగ్ లేకుండా రాజావారు చక్కా వచ్చేసి కూచోబడిపోయారు—మిస్టర్ గిరీశం! యు హావే గెస్ట్ అంటూ—ఏఁవుంది. పెద్దవాళ్ళతో మాటాడ్డం మజాకా అనుకున్నావా – మీ నాన్న దగ్గర మనిద్దరం గడాగడా ఇంగ్లీషు మాటాడినట్టుకాదు. టాపిక్స్ హైలెవెల్‌లో ఉంటాయి. అంతా హైక్లాసాఁమె. వెధవది పరగడుపున టాప్‌గేర్‌లో పడి దొరలభాషలో గుక్క తిప్పుకోకుండా ఫెడీ ఫెడీమని—సినిమావాళ్ళన్నట్టు డైలాగ్స్ విసిరేసుకోడం మాటలా. ఆ మాటకొస్తే మాటలేగాని, దాన్నిగదరగా ఆ హర్రీలో కొటేషన్‌లు ధప్పళంలో గుమ్మడికాయ వంకాయ వగైరా ముక్కల్లా ఎగిరెగిరిపడ్డాయేమో – ఏది గుమ్మడికాయో, ఏది వంకాయోకూడా మర్చిపోయాయి— అలా తెల్లమొహం పెట్టకు.సిగ్గుచేటు. ఇది కవిసమయంలే.– ఆ కొటేషన్లు ఒకరి వొకరికి తగిలించేశాం – అటు రాజా వారు ఊహూ సిగ్గుపడిపోతున్నారు .... ఆ బట్లరువెధవ రాజావారి వెనకాల తగలడి ముసిముసినవ్వులు నవ్వుతున్నాడు. ఇహ నాబోరు దక్కదని పసిగట్టి తమాయించుకునేసరికది పోనేపోయింది.

వెధవది ఎంతచెడ్డా అంత తెలీదుటోయ్. ఆ వెధ వాయి ఆవలించకపోయినా పేగుల్లెక్కెట్టేశాను—హారినీ! గిరీశం! పరాయిదేశంవచ్చి తప్పులో కాలేశావోయ్.

వాటెఫాల్ మైకంట్రీమన్ అనుకున్నా. సారీ .... అదిగో అదిగో చూశావా - ఆనాటిదెబ్బ తడాఖా! మళ్ళీ రాంగ్ కొటేషను పడింది.

తరవాత, మైడియర్ వెంకటేశం - మీ నాన్న నీ చేతో ఫ్రూట అశనం నాగాపెట్టిస్తే ఎలాటి ప్రొఫౌండ్ థాట్స్ వస్తాయి? ... అలాటివొచ్చాయి. రిపెంటెన్స్‌తో బాధపడి నా గదిఅంతా రిసెర్చి చేశాను పచార్లుకొడుతూ. చివరికి, 'గిరీశం! నోయూజ్ ... మెమొరీపవర్ స్లిప్పవుతోంది. ప్లేటు ఫిరాయించు. చేంజి ద టాక్టిక్స్ ....అని తీర్మానించుకున్నాను. షేక్స్పియరుగానీ, ఆయన ఫాదరేగానీ ఎవడైనాసరే కొటేషను వాడకు. ఊరికే అనవసరపబ్లిసిటీ అఘోరించకు. యిచ్చినా ఆథరుపేరు చెప్పకు. కొటేషను వాడి బాబుసొమ్ముగాదుగా-వాడిసొమ్మే. అంచేత వసిష్టం. కాక వాడిపేరిట జమపడ్డవి నూటికి తొంబయిఉన్నప్పుడు ఆ మిగతా పదీ బైహార్టుచేసి పారేస్తే బెస్టుగదా, నెస్టీఫస్ట్ అన్నాడు. ఫస్టెయిడ్ వాడుగాబోలు - వీడు కాపోయినా ఫర్వాలేదు - కాదనడుగా. కాబోలనుకొని సంతోషిస్తాడు ముండావాడు పాపం ...

చెప్పొచ్చిందేవిటంటే, ఇదంతా కష్టపడి రిసెర్చి చేసి రాసి పారేసినట్టు ఏరాయిటర్రిపోర్టరో ఇండియా చెవిలో ఊదేశాడు. మీ అంకులన్నట్టు వాడసాఘ్యం గూలా - అంతే ఏరోడ్రోములో దిగ్గానే యూనివర్సిటీల వాళ్ళు చుట్టుముట్టేసి మీ థీసిస్ మా కివ్వండంటే మా కివ్వండని పిహెచ్. డీలు ఎరపెట్టారు.

మనం పుచ్చుకోలేదనుకో. నో అన్నాం ఖచ్చితంగా. షేమ్ అన్నాం ధైర్యంగా. సారీ అన్నాం క్రూరంగా.

ఇది నాకోసం కాదు. లోక కల్యాణంకోసం - మా బ్రదరిల్లా వెంకటేశంలాటి వాళ్ళకోసం. పాపం ఆ అమాయకులు తప్పుడు కొటేషన్లు చెప్పి, చెప్పుదెబ్బలూ చీవాట్లూ తింటూ ఉంటే___

సినిమాలూ అవీ తీసి రాతాకోతా చేసీ గూబ్బద్దల యేలా ఎడాపెడా ఫెడీ ఫెడీ విమర్శలు తింటూఉంటే___

వాళ్ళ సిస్టర్ బుచ్చమ్మ వెన్నలాటి సున్నితమైన హృదయం తమ్ముడి అవస్థచూసి క్షోభపడి పోతూఉంటే నేను చూడలేను. చూసి భరించలేను. ఇంఫాసిబుల్. అంచేత వాళ్ళకే ఈ థీసిస్ అంకితం చేస్తాను. ప్రచారం చేస్తాను. అని చెప్పి, ఆ జనం తెచ్చిన పిహెచ్. డీ లన్నిటినీ డీ డిక్కులు కొట్టుకోమని వదిలేసి చక్కా-వచ్చా.

రేపొద్దున్న నువ్వు ప్రొడ్యూసర్వై, నేను డైరెక్టర్నై, మన డార్లింగ్ స్వీట్‌హార్ట్ బుచ్చమ్మ హీరోయిన్నై పిక్చరు తీయబోతూ ఉండగా నేను ఇదంతా వదిలేసి, డిగ్రీలకోసం, సన్మానాలకోసం అలా ఊళ్ళవెంట పడిపోడం-హౌ మాస్-హౌ ఇటీజ్ పాసిబుల్ ?

అంచేత అబ్బీ, అదీకథ.

అన్నట్టు కథంటే జ్ఞాపకం వచ్చింది. ఇపుడు మనం నెక్స్‌ట్ ఫిక్చరు స్టోరీ మీంచేగా ఇంతదూరం వచ్చాం. వస్తేవచ్చాంగాని ఎంత ఎడ్యుకేషనోయి! దాన్నిగదరగ నీ

మొహం ఎంత బ్రైటుగా ఉందో నీకేమన్నా అజ తెలుస్తోందా అని—అసలు నాతో మాట్లాడ్డమే ఓ ఎడ్యుకేషన్. కొందరితో మాట్లాడకపోడమే ఎడ్యుకేషనైనట్టు. ఎవడు చెప్మా ఇంత బ్రిలియంట్ డైలాగన్నాడు! ఎవడేమిటి నేనే కాబోలు. అంతే.నూటికి తొంబయి కొటేషన్లు నావేగా. వాళ్ళ అవుటాఫ్ డేటై ఫేడౌటయిపోతున్నారు.

ఇంతకీ నీబిక్క మొహం ఫేడౌట్ అయితేగాని కథ తెమలదు—కబుర్లు లేకపోతే పనెలా జరుగుతుందోయ్. అసలు కబుర్లు వున్నాయి కాబట్టే పనిని పని అన్నారు. ఇంతసేపు కబుర్లుచెప్పాం గాబట్టే ఇపుడు పని చూడాలి అని తెలిసిందిగదా.

కథా కమామిషూ అని ఊరికేవచ్చిందిషోయ్! సినిమాలో కమామిషుతోటే వుంది మరి కథంతా. అసలు కథంతా కలిపితే ఎంతటా తెలుగుఫిలింస్‌లో-వడ్లగింజలో ఆవగింజంత. మదరిల్లా అన్నట్టు—యీ వెంపు మధుర వాణి ఆ వెంపు బుచ్చమ్మా నిలబడితే రెండుకళ్ళు చాలవు. కావలసినంత కథ. పనిగట్టుకు రాయడమెందుకు వేరే? వాటీజినె స్టోరీ! కథంటూవుంటే అడ్డమైనవాడూ దాన్ని దుయ్యబడతాడు. అంచేత మనకొద్దు. అజ్ఞానులంతా కథా కాకరకాయా అంటూ తన్నుకుచావనీ. మనకేల—

ఇందులో ఒక గొప్ప సీక్రెట్ ఉందిసుమ్మీ. తెలుసుకో. అజ్ఞానులూ చాదస్తులూ వుంటేనే మనం ధగాధగా ష్షైనైపోయేది. వాళ్ళుంటేనే తిట్టేవాళ్ళు తిట్టగలిగేది.

తిట్లు తినిందికి ఎవడో ఒహడుంటేనే గదా తిట్టే వాడి ప్రతాపం వెలిగించి ప్రజ్ఞపేల్చొచ్చు. సంస్కరణ జరపడానికి, పరిమార్చడానికి, మార్చడానికి చెత్తేగదా ముఖ్యం. వీడో మారేజెస్ ద్వారా సివిలిజేషన్ పెరగడానికి బాల్యవివాహాలు అవసరమైనట్టే, కళాఖండాలు కావాలని అఘోరించడానికి చెత్త సినిమాలు సాలుకు బోలెడు వస్తూనే ఉండాలి. నాలాగ బ్రిలియంట్ థింకర్స్ వాటిమీద లెక్చర్ దంచుతూనే ఉండాలి. ఆ చెత్తలో ఓ మోస్తరు వాటికి ప్రయిజులు వస్తూనే ఉండాలి. నాలాటివాళ్లు మళ్ళీ వాటి మీద లెక్చర్లు దంచుతూనే ఉండాలి. ది సీక్రెట్ ఆఫ్ ప్రోగ్రెస్—దిస్ వరల్డ్—మై డియర్ వెంకటేశం—ఇన్ షార్ట్ ఈజ్,....ఈజ్,.

అవునుగాని, ఒక చిన్నపని చేస్తావూ. నేను ఇందాకట్నించి ఒఖలాగ ఓరకంట చూస్తూన్నా ఈ ఆర్టికల్ కి మొదటి పేజీలోవున్న పోర్ట్రెయిట్ మన్దో కాదో కనబడి చావటంలేదు. ఈ కళ్ళజోడు అంచోటి....ఔట్ ఫీల్డ్ లో కిందని ఆ మడతలూ అవీ చూస్తే పంచెలాగే వుందిగాని, అది కోకన్నా కావచ్చు. దే రా రాల్వేజ్ టూపాసిబిలిటీస్-ఎప్పుడూ రెండందాలా అవకాశాలుంటాయి—మొన్న అదేవిటో హాలివుడ్ పిక్చర్లో లావుపాటి మిలిటరీ వాడన్నట్టు...అంచేత నువ్వేదో పనున్నట్టు చూడు...మంది కాదా!...పోన్లే....యూ మస్ట్ బీ గ్రేస్ఫుల్ వెంకటేశం-ఇంకోలా ఉండిందికి పీల్లేపోతే మంచిగానే ఉండమన్నాడు

కొంచెంసేపు మరి—అడుగో మీ అంకులొస్తున్నాడు. స్టోరీ ఎంతవరకైందంటాడు గాబోలు—డిస్ట్రిబ్యూటర్కన్న అన్యాయంగా ఉన్నాడే. అరే అట్నించలాగే పోతున్నాడే- అడ్వాన్సు చెపాయించేస్తాననా? అక్కణ్నించే ఎలా పసిగట్టాడూ!....ఇప్పుడు మరి కాపర్సు లేవే! ఎలా చెప్మా సిగార్స్కి—డామిట్—

